సాక్షి మహబూబాబాద్

బుధవారం । 8 । జనవరి । 2025



హెచ్ఎంపీవీ కలకలం

చైనాను గడగడలాడిస్తున్న హెచ్ఎంపీవీ భారత్‌కు చేరుకోవడంతో కేంద్రం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది.

- 8లో▸



జాతరలో సౌకర్యాలు కల్పించాలి

మేడారం సమ్మక్క, సారలమ్మ సన్నిధిలో భక్తుల అవసరాలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి సీతక్క సూచించారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$31.0^0/14.1^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రివేళ చలితోపాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఉపాధి పనులు త్వరగా ప్రారంభించాలి



గూడూరు: మండలంలోఉపాధి హామీ పనులను త్వరగా ప్రారంభించాలని డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఈజీఎస్ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, టీఏలతో ఉపాధి పనులు,నర్సరీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలో ఉపాధిపని తీరుపై, నర్సరీల ఏర్పాటుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ జీపీలో పనులను త్వరగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరస్వామి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఉచిత కుట్టుమిషన్‌ల పంపిణీకి క్రిస్టియన్ మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి బి.శ్రీనివాస్‌రావు మంగళవారం తెలిపారు. ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద పేద, నిరుద్యోగ అర్హత గల మహిళలు టీజీఓబీఎంఎం.సీజీజీ.గౌట్.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 20న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9182540680, 9573769507 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

'సాంస్కృతిక సారథి' జిల్లా అధ్యక్షుడిగా సత్యనారాయణ



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కంబాలపల్లి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డీపీఆర్ఓ పసునూరి రాజేందర్‌ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా డీపీఆర్ఓ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో సాంస్కృతిక సారథి కళాకారులు కీలక పాత్ర పోషిస్తున్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణను డీపీఆర్ఓ ఉద్యోగ సిబ్బంది, కళాకారులు సన్మానించారు. కార్యక్రమంలో కొమునే వెంకన్న, గద్దె రాంనర్సయ్య, మెరుగు రవీందర్, బండ వెంకన్న, మునికుట్ల ఐలేష్, జిన్నా, సురేష్, అనిల్, యాది, ప్రవీణ్, యుగంధర్, నరేష్, పాషా, అంజలి, రోజా, రాజ్యలక్ష్మి, అశ్విని, కవిత, సింధుజా, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత మనందరి బాధ్యత

మహబూబాబాద్ అర్బన్: రోడ్డు భద్రతా నియమాలను ప్రతీ ఒక్కరు బాధ్యతగా భావించాలని జిల్లా రవాణాశాఖ అధికారి జైపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రలోని పలు సెంటర్లలో మంగళవారం జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాలు నిర్వహించి వాహనదారులు, ఆటో కార్మికులతో జిల్లా రవాణాశాఖ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ప్రతీ నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుందని, ప్రతీ మూడు నిమిషాలకు అదే రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు సాయి చరణ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



లచ్చమ్మ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని మాధవాపురం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు గుండోజు లచ్చమ్మ (104)వయోభారంతో మంగళవారం ఉదయం ఇంటి వద్ద మృతి చెందింది. ఆమెకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బుధవారం ఉదయం 10గంటలకు లచ్చమ్మ అంత్యక్రియలు జరుగుతాయని కుమారుడు గుండోజు నాగార్జునాచార్యులు తెలిపారు.

దేశీ డీలర్లకు తుది పరీక్ష

మహబూబాబాద్ రూరల్: మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో దేశీ బ్యాచ్ డీలర్లకు మంగళవారం తుది పరీక్ష నిర్వహించారు. డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్ పుట్ డీలర్ల కోర్సు 48 వారాలపాటు 40 మంది ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్లకు నిర్వహించారు. పరీక్షల నిర్వహణ బాధ్యులుగా బి.గోపిచంద్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, ఏడీఏ మురళి, మల్యాల కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మాలతి, శాస్త్రవేత్తలు కిషోర్ కుమార్, రాంబాబు, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

- కాల్వలను శుభ్రం చేయడంలో కార్మికుల అలసత్వం
- ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- పందుల స్వైరవిహారం.. పెరిగిన దోమలు



సర్వేపల్లి రాధాకృష్ణన్ సెంటర్‌లోని ప్రధాన రహదారి పక్కన కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారం



కిరాణా వర్తక సంఘం భవనం సమీపంలో రోడ్డుపైనే చెత్తాచెదారం

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టడం లేదు. అధికారుల పర్యవేక్షణ కొరవడి పలు ప్రాంతాల్లో రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోయింది. కాల్వలను శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు సంఖ్య పెరిగింది. అలాగే పరిసరాలు అపరిశుభ్రంగా మారి పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఖాళీ స్థలాలను యజమానులు శుభ్రం చేయకపోవడంతో కూడా పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది.

పర్యవేక్షణ లోపంతోనే సమస్య..

కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులు కేవలం ప్రధాన రహదారులపైనే దృష్టి పెడుతున్నారు. కమిషనర్‌తో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ప్రధాన రోడ్లకే పరిమితమవుతున్నారు. గల్లీలు, శివారు కాలనీల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టడం లేదు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కంటి మీద కునుకు ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమ కాటుతో రోగాల బారిన పడి ఆస్పత్రులు చుట్టూ తిరుగుతున్నామని వాపోతున్నారు. నెలలో ఒకసారి కూడా కాల్వలను శుభ్రం చేయడం లేదు. దీంతో కాల్వల్లో చెత్తాచెదారం పోగై దుర్గంధం వెజల్లుతోంది. వాహనాలు సకాలంలో రాకపోవడం, పలు ఇతర కారణాలతో కొన్ని ప్రాంతాల్లో రోడ్లపైనే చెత్తాచెదారం వేస్తున్నారు. వాటిని కార్మికులు వాహనాల్లో వేయకుండా వదిలేస్తున్నారు. కొంత మంది కార్మికులు షాపుల ఎదుట శుభ్రం చేయడం, ఫంక్షన్ హాల్స్, హోటళ్లు, ఇతర వ్యాపారం చేసే వారికి సహకరిస్తున్నారు. వారు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి చేయాల్సి పనిపై శ్రద్ధ చూపడం లేదు. ఇస్తున్న వేతనానికి కొంత మంది కార్మికులు న్యాయం చేయకపోవడంతో కూడా సమస్య తలెత్తుతోంది.

ఖాళీ స్థలాలతో..

జిల్లా కేంద్రం, శివారు కాలనీల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారంతో పాటు మొక్కలు ఏపుగా పెరిగి పందులకు అవాసంగా మారాయి. అధికారులు స్థలాల యజమానులకు కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఆ స్థలాల వల్ల కూడా పారిశుద్ధ్య సమస్య పెరుగుతోంది.

143 మంది కార్మికులు..

మానుకోట మున్సిపాలిటీ పరిధిలో సుమారు లక్ష జనాభా నివాసం ఉంటున్నారు. 25,000కు పైగా గృహాలు ఉన్నాయి. కాగా మున్సిపాలిటీలో 143 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. కాగా కారోబార్లు, వాటర్ సరఫరా చేసే వారితో కలిపితే 203 మంది ఉన్నారు. ట్రాక్టర్లు 9, మూడు చక్రాల ఆటోలు 14, నాలుగు చక్రాల ఆటోలు 19 ఉన్నాయి. ప్రతీరోజు 20టన్నుల తడి చెత్త, 13 టన్నుల పొడిచెత్త సేకరిస్తున్నట్లు పర్యావరణ అధికారి గుజ్జు క్రాంతి తెలిపారు. సేకరించిన చెత్తను సిగ్నల్ కాలనీ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డు, గాంధీపురం డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. కమర్షియల్ ప్రాంతాల్లో రోజులో రెండుసార్లు చెత్త సేకరిస్తున్నట్లు తెలిపారు. తడి చెత్త, పొడిచెత్త వేరు చేసి ఇవ్వాలని, వాహనాలు రాగానే వాటిలో వేయాలని అవగాహన కల్పించారు.

పనులను పర్యవేక్షిస్తున్నాం ..

> పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ప్రతీరోజు పనులను పర్యవేక్షిస్తున్నాం. కమర్షియల్ ప్రాంతాల్లో రోజుకు రెండుసార్లు చెత్త సేకరణ చేస్తున్నాం. ప్రతీవార్డుకు వాహనం ప్రతీ రోజు వెళ్లి ఇళ్ల నుంచి సిబ్బంది చెత్త సేకరిస్తున్నారు. సమస్య ఉంటే కార్యాలయంలో తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తాం.
>
> \- నోముల రవీందర్, మున్సిపల్ కమిషనర్

ఏసీబీ దడ..



- వరుస దాడులతో ఉద్యోగుల ఉక్కిరిబిక్కిరి
- అక్రమార్జన అధికారుల్లో హడల్
- ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన

సాక్షి, మహబూబాబాద్: మానుకోట జిల్లా అవినీతి అధికారులకు అడ్డాగా మారిందనే చర్చ సాగుతోంది. ఒకరి తర్వాత ఒకరు అధికారులు వరుసగా అవినీతి నిరోధక శాఖకు పట్టుబడుతున్నారు. సోమవారం తొర్రూరు సీఐ జగదీశ్ ఏసీబీకి చిక్కిన నేపథ్యంలో జిల్లాలోని వివిధ శాఖల్లో ఈ అంశంపైనే చర్చ సాగుతోంది. కాగా పైసలు ఇవ్వనిదే దస్త్రం ముట్టం అన్నట్లు ఉన్న అధికారులకు ఈ దాడులు చెంపపెట్టు అని పలువురు అంటున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఏసీబీ నిఘా పెట్టిందనే ప్రచారం కూడా ఉంది.

వరుస దాడులతో..

జిల్లా వ్యాప్తంగా ఇటీవల పలువురు అధికారులు ఏసీబీకి చిక్కారు. గతంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, తర్వాత ఆడిట్ డిపార్ట్‌మెంట్‌లో ఇద్దరు ఉద్యోగులు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఆ తర్వాత పంచాయతీరాజ్ శాఖ ఏఈ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అదేవిధంగా కొత్తగూడ మండలం గుంజేడు ముసలమ్మ దేవాలయ ఈఓ ఏసీబీకి దొరికారు. తొర్రూరు లేబర్ ఆఫీసర్, మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్, జిల్లా రవాణాశాఖ అధికారి, ఇటీవల కాలంలో ల్యాండ్ సర్వే డిపార్ట్‌మెంట్ అధికారి లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఈ షాక్ నుంచి తేరుకోకముందే ప్రసుత్తం తొర్రూరు సీఐ ఏసీబీకి చిక్కారు.

అక్రమ వ్యాపారుల కొమ్ముకాస్తూ..

అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులే అక్రమాలకు పాల్పడుతూ ఏసీబీకి చిక్కడంపై జిల్లాలో చర్చగా మారింది. ఇప్పటికే మానుకోట అంటే గుడుంబా తయారీ, బెల్లం అమ్మకాలు, గంజాయి రవాణాకు అడ్డాగా మారిందనే పేరు ఉంది. మరోవైపు ఆకేరు, మున్నేరు, రాళ్లవాగు మొదలైన చోట్ల ఇసుక దందా, ప్రభుత్వం పేదలకు సరఫరా చేస్తున్న పీడీఎస్ బియ్యం దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అయితే వీటిని కట్టడి చేసేందుకు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అనేక ప్రయత్నాలు చేశారు. మార్పుకోసం అనే కార్యక్రమంతో అవగాహన కల్పించారు. గుడుంబా తయారీ మానేసిన వారికి ప్రోత్సాహకాలు అందజేశారు. అయినా ఒక చోట కట్టడి చేస్తుంటే.. మరోచోట బెల్లం, గంజాయి రవాణా చేస్తూ పట్టుపడడం, ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ఫిర్యాదులు తరచూ వస్తున్నాయి. ఈ క్రమంలోనే పోలీస్ అధికారి ఏసీబీకి పట్టుపడడం గమనార్హం.

అక్రమార్కుల్లో హడల్..

జిల్లాలో వరుస దాడుల్లో అక్రమార్కులు ఏసీబీకి పట్టుపడడం, అవినీతి అధికారులను పట్టించేందుకు సహకరించండి అని ఏసీబీ అధికారులు ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందో అని అక్రమ సంపాదనకు ప్రయత్నించే అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖలపై ఏసీబీ అధికారులు నిఘా పెట్టారనే విషయం కూడా ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితిలో అక్రమ అధికారులు తమ వక్రబుద్ధి మార్చుకుంటారా.. లేదా ఏసీబీ వలలో చిక్కుతారా అనేది ప్రశ్నగా మారిందని చర్చించుకుంటున్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

తొర్రూరు: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. 71 మందికి రూ.71.33 లక్షల విలువ చేసే చెక్కులను అందించారు. అనంతరం రైతు భరోసా సాయం పెంపును హర్షిస్తూ పట్టణంలోని గాంధీ విగ్రహం ఎదుట సీఎం చిత్రపటానికి ఎమ్మెల్యే పాలాభిషేకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకం విషయంలో ప్రభుత్వం ఒక్క అడుగు వెనక్కి వేయబోదన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని, ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని.. పేదల కోసం పని చేస్తుందన్నారు. రైతు భరోసా సాయం పెంపు, కొత్త రేషన్ కార్డుల మంజూరుతో ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకుంటుందన్నారు. మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ నర్సింగరావు, నాయకులు సోమ రాజశేఖర్, సురేందర్‌రెడ్డి, వెంకటాచారి, రవీంద్రాచారి, అచ్చిరెడ్డి, దేవేందర్‌రాజు పాల్గొన్నారు.

కూలీలొస్తున్నారు...

- డోర్నకల్ రైల్వే స్టేషన్‌కు రాక
- తర్వాత గ్రామాలకు తరలివెళ్తున్న కూలీలు

డోర్నకల్: డోర్నకల్ రైల్వేస్టేషన్ పదిరోజులుగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌కు చెందిన కూలీలతో సందడిగా మారింది. ఇక్కడికి చేరుకున్న కూలీలు మహబూబాబాద్, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాలతో పాటు ఏపీలోని నందిగామ, కృష్ణా జిల్లాల్లో సాగవుతున్న మిరప తోటల్లో కాయకోత పనులకు వెళ్తారు. కాగా మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కాజీపేటకు చేరుకుని అక్కడి నుంచి రైళ్లలో డోర్నకల్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటున్నారు. రైతులు కూలీలను వాహనాలలో తమ వ్యవసాయ భూముల వద్దకు తరలిస్తారు. అక్కడే కూలీలకు తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసి కాయకోత పనులు చేస్తున్నారు. సుమారు రెండునెలల పాటు కూలీలు కాయకోత పనుల్లో పాల్గొంటారు.

స్థానికుల ఆందోళన...

ప్రతీరోజు ఇతర రాష్ట్రాల నుంచి వందలాది మంది కూలీలు డోర్నకల్ రైల్వేస్టేషన్‌కు చేరుకుని ఆవరణలో గుంపులుగా గంటల తరబడి ఉండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హెచ్ఎంపీవీ వైరస్ వ్యాప్తి చెందుతుందన్న ప్రచారంతో ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కూలీలు రావడం, గంటల తరబడి స్టేషన్ ఆవరణలో ఉండటం, గుంపులుగా వీధుల్లో సంచరిస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



డోర్నకల్ రైల్వేస్టేషన్ ఆవరణలో వాహనాల కోసం ఎదురుచూస్తున్న కూలీలు



వ్యవసాయ భూముల్లో నివాసం ఏర్పాటు చేసుకుని భోజనం చేస్తున్న కూలీలు

అంగన్‌వాడీలకు గౌరవ వేతనం ఇవ్వాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లకు గౌరవ వేతనం రూ.26వేలు అందించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లారీశ్వరి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బి.అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ సెంటర్ల అద్దెలు, గ్యాస్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని, ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్‌కు, జిల్లా సంక్షేమాధికారికి వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. లక్ష్మినరసమ్మ, లలిత, సౌమ్య శ్రీ,పద్మ, శివమ్మ, సరిత, భానుమతి, స్వప్న, మహలక్ష్మి, కవిత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



ఇస్లావత్ శ్రీను(ఫైల్)

మహబూబాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. ఈ ఘటన సోమవారం రాత్రి మహబూబాబాద్ మండలం ఆమనగల్, శనిగపురం గ్రామాల మధ్య చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపిక కథనం ప్రకారం.. మహబూబాబాద్ మండలం బలరాంతండా గ్రామానికి చెందిన ఇస్లావత్ శ్రీను (41) గార్ల మండలంలోని తమ బంధువు దశదిన కర్మకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వాహనం ఆమనగల్, శనిగపురం గ్రామాల మధ్య చెట్టును ఢీకొంది. దీంతో శ్రీను తీవ్రగాయాలతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న అతడి బంధువులు, గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పోస్టు మార్టం గదికి తరలించారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రయాణం.. నరకప్రాయం

- ఖమ్మం–వరంగల్ హైవేపై గుంతలు
- ప్రయాణికుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



మరిపెడలో ఖమ్మం–వరంగల్ హైవేపై ఏర్పడిన గుంతలు

మరిపెడ రూరల్: మరిపెడ మండలంలో ఖమ్మం–వరంగల్ 563 జాతీయ రహదారిపై ఏర్పడి గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణాలు సాగిస్తున్నారు. సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కుడియాతండా, నీలికుర్తి స్టేజి సమీపంలో రహదారిపై ఫీట్ లోతు గుంతలు ఏర్పడ్డాయి. ఈక్రమంలో వాహనాలు అదుపుతప్పడంతో కిందపడిన సంఘటనలు ఉన్నాయి. కొందరు మృతి చెందారు. అయితే ఇప్పటి వరకు సంబంధిత అధికారులు మాత్రం స్పందించలేదు. కాగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హైవేపై ఏర్పడిన గుంతలను పూడ్చి సురక్షితమైన ప్రయాణం కల్పించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని..



> ఖమ్మం–వరంగల్ హైవేపై పెద్ద గుంతల కారణంగా ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోంది. ఆదమరిస్తే అంతే సంగతులు. గుంతలో ద్విచక్రవాహనం పడితే ప్రాణాలు పోవాల్సిన దుస్థితి నెలకొంది. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.
>
> \- మచ్చర్ల కృష్ణ, ద్విచక్రవాహనదారుడు, వీరారం

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

- డీఎంహెచ్ఓ మురళీధర్



తొర్రూరు: మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ మురళీధర్

తొర్రూరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేందుకు ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్ఓ మురళీధర్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆశ కార్యకర్తలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.సుగుణాకర్‌రాజుతో కలిసి డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. సిజేరియన్ ఆపరేషన్లతో తల్లీబిడ్డల ఆరోగ్యం పాడవుతుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 44 శాతం ప్రసవాలు జరుగుతున్నాయని, 6 మాసాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. గర్భిణి నమోదు మొదలుకుని బిడ్డ పుట్టిన తర్వాత వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చేవరకు ఆశ కార్యకర్తలు జాగ్రత్తలు వహించాలన్నారు. వైద్యులు మీరాజ్, ప్రియాంక, నందన, మానస ఉన్నారు.

సుఖ ప్రసవాల సంఖ్య పెంచాలి

దంతాలపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుఖ ప్రసవాల సంఖ్య పెంచాలని డీఎంహెచ్ఓ మురళీధర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన ఆశ డే కార్యక్రమానికి డీఎంహెచ్ఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వైద్యాధికారి చైతన్య, కవిత, ఆశకార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎండు గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్

మహబూబాబాద్ రూరల్: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తీసుకువెళ్తున్న నాలుగు కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ మంగళవారం తెలిపారు. ఒడిశాలోని జనక గ్రామానికి చెందిన నిషికాంత స్వైన్, సత్యజిత్ స్వైన్.. కోణార్క్ రైలులో రెండు సంచుల్లో ఎండు గంజాయి ప్యాకెట్లు తీసుకెళ్తుండగా ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు పట్టుకుని తమకు అప్పగించారన్నారు. దీంతో గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో టౌన్ ఎస్సై బి.విజయ్ కుమార్, పీసీలు మోహన్, వీరన్న, రమేశ్ చంద్ర, గౌతమ్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో దెబ్బతిన్న మిర్చి పంటల పరిశీలన



మిర్చితోటను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాస్ ఉద్యాన శాఖ అధికారులు

గార్ల: నకిలీ విత్తనాలతో దెబ్బతిన్న మిర్చి పంటలను వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. గత నెల 27న 'నకిలీ విత్తనాలతో నష్టపోయిన మిర్చి రైతులు' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై అధికారులు స్పందించారు. అలాగే, ఈ ఘటనపై సదరు రైతులు రాష్ట్ర వ్యవసాయశాఖ చైర్మన్ కోదండరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు స్పందించి ఆ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు.. ఖమ్మం, వైరా నర్సరీల్లో మిర్చి విత్తనాలు, మొక్కలు కొనుగోలు చేసి పంటలు సాగు చేయగా సన్న రకానికి బదులు దొడ్డు కాయలు, మిర్చికి బదులు అక్కడక్కడ క్యాప్సికం కాయలు కాశాయని, తమకు పరిహారం ఇప్పించాలని విన్నవించారు. అనంతరం అధికారులు, శాస్త్రవేత్తలు మిర్చి తోటలు సందర్శించి మొక్కల సంఖ్య, నర్సరీ వేసిన తేదీ, వాడిన ఎరువులు, పరుగు మందుల వివరాలు రైతుల నుంచి సేకరించారు. మొక్కల జన్యు స్వచ్ఛతను రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని మహబూబాబాద్ ఏడీఏ అజ్మీరా శ్రీనివాస్ వెల్లడించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి శాంతిప్రియ, మిర్చిపంట ప్రధాన శాస్త్రవేత్త రాంబాబు, ఏఓ కావటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేల, నీటి సంరక్షణపై శిక్షణ



మాట్లాడుతున్న విజయగౌరీ

కేసముద్రం: మండల కేంద్రంతో పాటు ఉప్పరపల్లి రైతువేదిక భవనాల్లో నేల, నీటి సంరక్షణ, యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వలంటరీ డైరెక్టర్ విజయగౌరీ,డీఏఓ విజయనిర్మల.. వర్షాధారిత ప్రాంతాల్లో నేల, నీటి సంరక్షణ పద్ధతులపై వివరించారు. డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింకర్ల వాడకం,వర్షపు నీటిని నిల్వ చేసే పద్ధతులు, నీటి కుంటలు, మల్చింగ్ విధానంతో పాటు పలు అంశాల గురించి తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ సునీత, ఏఓ అన్నపూర్ణ, డీజీఎం సుబ్బారావు, ఏఓ వెంకన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో గవర్నర్ పీఎస్ దాన కిశోర్



ములుగు : గవర్నర్ దత్తత గ్రామం ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని కొండపర్తిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ (పీఎస్) దాన కిశోర్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాజ్‌భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన పనులపై కలెక్టర్ టీఎస్ దివాకరను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నత శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన జరుగుతుందన్నారు. ఈ నెల 28వ తేదీలోగా సివిల్ పనులు పూర్తి చేసి కాంట్రాక్టర్ భవనాన్ని అప్పగించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు రాష్ట్రస్థాయి అవార్డు



కాళేశ్వరం : మహదేవపూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాల రాష్ట్రస్థాయిలో బెస్ట్ ప్రాక్టీస్ స్కూల్‌గా ఎంపికైంది. రాష్ట్రంలోని 21ప్రభుత్వ పాఠశాలలో మల్టీజోన్ వన్ పరిధిలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు హెచ్ఎం పి.సరిత, ఉపాధ్యాయుడు మడక మధు మంగళవారం తెలిపారు. మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ సమర్పణలో హైబిజ్ టీవీ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డ్స్-2024ను హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అందుకున్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపిక కావడానికి పాఠశాలలోని ఉపాధ్యాయులు వివిధ అంశాలలో సమర్థవంతంగా బోధన చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.సుధారాణి, సరితాదేవి, వలిపాషా, శ్రీనివాస్, వసుధప్రియ, వీరేశం, సమ్మయ్య, రజిత, ఫర్హానా కౌసర్, షాహిదా, ప్రసూన, పూర్ణిమ, దీపిక, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల పట్టివేత

వరంగల్ : అక్రమంగా గుట్కా విక్రయాలు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు శివనగర్, రామ్‌కీ ఎన్‌క్లేవ్, కరీమాబాద్ ప్రాంతాల్లో దాడులు చేశారు. ఈ దాడిలో వ్యాపారులు అల్లాడి సాయిరాం, చకిలం నాగరాజు, భీమనాథ్ హరితేజతో పాటు రూ.16,200ల విలువైన గుట్కాలు, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాబూలాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ఆక్సిజన్'పై అప్రమత్తత అవసరం..

ఫస్ట్ వేవ్, సెకండ్ వేవ్ సమయంలో ఎంజీఎంలో కరోనా రోగులకు చికిత్స అందిస్తున్న సమయాల్లో కొన్నిసార్లు ఆక్సిజన్ కొరత వైద్యులను బెంబెలెత్తించింది. ఢిల్లీ నుంచి లిక్విడ్ ఆక్సిజన్ విమానంలో హైదరాబాద్‌కు వచ్చాక అక్కడినుంచి ట్రాఫిక్ రద్దీని తట్టుకొని ఎంజీఎం వరకు వచ్చేంత వరకు ఆగమాగం అయ్యేవారు. ఎందుకంటే ఎంజీఎంలో రెండు లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంక్‌లు ఉండడంతో ఒక ట్యాంక్ అయిపోయిందంటే చాలు వైద్యుల్లో ఆందోళన మొదలయ్యేది. ఫస్ట్ వేవ్‌లో పదివేల లీటర్లు (పది కిలో లీటర్లు), రెండో వేవ్‌లో 13,000 లీటర్లు (13 కిలో లీటర్లు) ఏర్పాటుతోనే ఉన్నంతలో రోగులకు మెరుగైన సేవలందించారు. ఈ ఆక్సిజన్ కొరత నుంచి నేర్చుకున్న పాఠాలతో ఆక్సిజన్ ఉత్పాదక ప్లాంట్‌లు వచ్చేలా చూశారు. పీఎం కేర్ నిధులతో పాటు ఎల్అండ్‌టీ కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఏర్పాటుచేసిన ఈ రెండు ప్లాంట్‌లు కలిసి నిమిషానికి రెండు వేల లీటర్ల ఆక్సిజన్ ఉత్పత్తి చేసి ఏకకాలంలో వందల మందికి క్సిజన్ అందించనున్నాయి. ఫలితంగా చాలామంది ప్రాణాలు నిలబడే అవకాశం ఉంది. అదే విధంగా కరోనా సమయంలో మంజూరైన 100 వెంటిలేటర్లు ఆస్పత్రిలోనే ఉన్నాయి. అయితే వీటన్నింటిపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండటంతోపాటు సరిపడే సిబ్బంది ఉండేలా చూడాల్సి ఉంది.



ఆస్పత్రి ఆవరణలోని ఆక్సిజన్ ప్లాంట్లు





వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రి

హెచ్ఎంపీవీ కలకలం

తెరమీదకు మరో మహమ్మారి

- ఉత్తర తెలంగాణ గుండెకాయ ఎంజీఎం.. ఈ ఆస్పత్రిపైనే అందరి ఆశలు
- కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలను తాకిన 'హ్యూమన్ మెటాన్యూమో'
- ప్రబలుతున్న చైనా వైరస్‌పై ఆందోళన..

సాక్షిప్రతినిధి, వరంగల్ : చైనాను గడగడలాడిస్తున్న హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ) భారత్‌కు చేరుకుంది. కర్ణాటకలో సాధారణ పరీక్షల సమయంలో భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) రెండు హెచ్ఎంపీవీ కేసులను గుర్తించిందని ఎక్స్ వేదికగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ రెండు కేసుల్లోనూ పిల్లల్లోనే ఈ వైరస్ కనిపించగా, ఇందులో రాజస్తాన్‌లోని డెంగర్‌పూర్ నుంచి సర్వార్‌కు వచ్చిన ఓ చిన్నారి ఈ వైరస్ బారిన పడినట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో బెంగళూరులో 8 నెలల చిన్నారి హెచ్ఎంపీవీ బారిన పడి ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ నేపథ్యంలో హెచ్ఎంపీవీ వైరస్‌పై కేంద్రం రాష్ట్రాలను అప్రమత్తం చేయగా.. హెచ్ఎంపీవీ వైరస్ అంటే ఏమిటి..? దాని లక్షణాలు ఏమిటి..? చికిత్సలు ఎలా? ఈ పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై వైద్య ఆరోగ్యశాఖ దృష్టి సారించింది. ఇదే సమయంలో ఉత్తర తెలంగాణ (కాళేశ్వరం, రాజన్న, బాసర, భద్రాద్రి)లోని 18 జిల్లాలకు గుండెకాయల ఉన్న వరంగల్ మహాత్మాగాంధీ మెమోరియల్ ఆస్పత్రిలో వసతులపై చర్చ జరుగుతోంది.



ఆస్పత్రిలోని ఓ వార్డులో ఉన్న ఆక్సిజన్ బెడ్లు

ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్సలకు సర్వం సిద్ధం



ఎంజీఎం ఆస్పత్రిలో ఎలాంటి ఫ్లూ లక్షణాలతో అడ్మిట్ అయిన రోగులకు చికిత్సలు అందించేందుకు సర్వం సిద్ధంగా ఉన్నాం. హెచ్ఎంపీవీ వైరస్ సైతం శ్వాసకోశ ఇబ్బందులకు గురి చేసే క్రమంలో ప్రస్తుతానికి ఆస్పత్రిలో 500కు పైగా ఆక్సిజన్ పడకలు అందుబాటులో ఉన్నాయి. ఆస్పత్రిలో 10,000 లీటర్లు, 13,000 లీటర్ల లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్లతో పాటు రెండు ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయి. అలాగే 100కు పైగా ఐసోలేషన్ పడకలు సైతం ఉన్నాయి.

- కిశోర్, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్, ఎంజీఎం, వరంగల్

కోవిడ్-19ను మించిన మరో వైరస్.. పరీక్షల నుంచి వైద్యం వరకు ఎంజీఎం..

కోవిడ్-19ని మించిన వేగంతో హెచ్ఎంపీవీ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ వైరస్ శ్వాసకోశ సంబంధిత ఇన్‌ఫెక్షన్ కావడంతో జాగ్రత్తగా ఉండాలని కూడా వారు చెబుతున్నారు. ఇదే సమయంలో మెరుగైన వైద్యసేవలు అందించే ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వాహకులను అప్రమత్తం చేస్తున్నారు. అనుకోని విపత్తుగా వస్తున్న మరో వైరస్‌పై పోరుకు ఎంజీఎం అడుగులు వేయాల్సి ఉంది. కరోనా సమయంలో 1250 పడకల ఈ ఆస్పత్రిలో మరో వంద పడకలు అదనంగా ఏర్పాటు చేశారు. కాకతీయ మెడికల్ కాలేజీ ప్రాంగణంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో మరో 250 పడకలు కూడా ఉపయోగంలోకి తెచ్చారు. కరోనా నిర్ధారణ పరీక్షల నుంచి వైద్య సేవల వరకు ఎంజీఎంలోనే జరిగాయి. ఫస్ట్ వేవ్ సమయంలో కరోనా పరీక్షలు చేస్తే ఆ నివేదిక రోగి చేతికందే సరికి మూడురోజుల సమయం తీసుకునేది. హైదరాబాద్‌లోని ఐపీఎంకు వెళ్లి అక్కడినుంచి నివేదిక వచ్చేవరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. ఈ మూడు రోజుల్లోనే కరోనా వచ్చిందన్న బెంగతో మరింత బలహీనంగా మారి అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రిలో చేరినవారు ఉన్నారు. ఈ నేపథ్యంలో అప్పటి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ 2017లోనే ప్రతిపాదించిన వైరల్ రీసెర్చ్ డయాగ్నస్టిక్ ల్యాబ్ ప్రస్తుతం అందుబాటులో ఉంది.

విద్యార్థులు ప్రణాళికాప్రకారం చదవాలి

- ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ యాదగిరి



మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ, ఉమ్మడి జిల్లా అబ్జర్వర్ యాదగిరి, పక్కన డీఐఈఓ గోపాల్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్

విద్యారణ్యపురి: ఇంటర్ మొదటి, సెకండియర్ పరీక్షలు సమీపిస్తున్నాయని, విద్యార్థులు ప్రణాళికా ప్రకారం చదువుకోవాలని ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీసెక్రటరీ, ఉమ్మడి వరంగల్ జిల్లా అకడమిక్ అబ్జర్వర్ టి. యాదగిరి సూచించారు. అలాగే, ఉత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. మంగళవారం ఉదయం తొలుత హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో-ఎడ్యుకేషన్)ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు ఎన్ని యూనిట్ టెస్టులు నిర్వహించారని అడిగి తెలుసుకున్నారు. సైన్స్‌ల్యాబ్‌లను పరిశీలించారు. అకడమిక్ పరంగా విద్యార్థుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఆర్. శ్రీనివాస్, ఆ కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృష్ణ ఆదిత ఇంటర్‌విద్య పటిష్టానికి తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంపుదల చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన వెంట డీఐఈఓ ఎ. గోపాల్ ఉన్నారు. అనంతరం జిల్లాలోని శాయంపేట, ఆత్మకూరు, పరకాల, హసన్‌పర్తి, ధర్మసాగర్ ప్రభుత్వజూనియర్ కళాశాలలను సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులు, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లతో మాట్లాడి అత్యధిక ఉత్తీర్ణత శాతం పెంపుదలకు కృషి చేయాలని కోరారు.

ఎక్కడున్నా..ఇంటికి రా బిడ్డా.!

- డీసీపీ సమక్షంలో శారద తండ్రి వేడుకోలు



శారద కుటుంబీకులకు వస్త్రాలు, సామగ్రి అందజేస్తున్న డీసీపీ

లింగాలఘణపురం : 'ఎక్కడున్నావు బిడ్డా.. ఇంటికి రావమ్మా.. ముసలితనంలో ఉన్నా.. ఒక్కసారి చూడాలని ఉందమ్మా.. ఇదే నా చివరి కోరిక' అంటూ మండలంలోని నెల్లుట్ల శివారు వడ్డెర కాలనీకి చెందిన అజ్ఞాతంలో ఉన్న పందిగోటి శారద తండ్రి చిన్నయ్య వేడుకున్నారు. సంక్రాంతి పండుగా సమీపిస్తున్న తరుణంలో అజ్ఞాతంలో ఉన్న శారద కుటుంబ సభ్యులకు జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో దుస్తులు, ఇంటి సామగ్రి, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ..1995లో విప్లవభావాలకు ఆకర్షితులరాలైన శారద దళంలోనే చేరి ఇప్పటి వరకు కొనసాగుతోందన్నారు. ఆమె తండ్రి చిన్నయ్య 75 ఏళ్ల వృద్ధాప్యంలో ఉన్నాడని, తల్లి చనిపోయిందని అజ్ఞాతంలో ఉన్న శారద జనజీవన స్రవంతిలో కలువాలని కోరారు. డీసీపీతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ, ఎస్‌బీ ఏసీపీ పార్థసారథి, రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, లింగాలఘణపురం ఎస్సై శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

అప్పుల బాధతో టాటా మ్యాజిక్ యజమాని ఆత్మహత్య




నాగరాజు(ఫైల్)

ఏటూరునాగారం: అప్పుల బాధతో టాటా మ్యాజిక్ యజమాని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం ములుగు జిల్లా ఏటూరునాగారంలో జరిగింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బాస నాగరాజు(42)కు రెండు టాటా మ్యాజిక్‌లు ఉన్నాయి. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో గిరాకీ లేక వాహనాల కిస్తీలు చెల్లించలేక అప్పుల పాలయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలని కొంతకాలంగా మనోవేదనకు గువుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి మంగళవారం వరకూ తిరిగి రాలేదు. 163 జాతీయ రహదారి వెంట ఉన్న ఇటుక బట్టీల వద్ద పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలో ఉన్నాడు. దీనిని చూసిన పలువురు వాహనదారులు కుటుంబ సభ్యులకు తెలపగా వారు ఘటనాస్థలికి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెంది కనిపించాడు. ఈ ఘటనపై భార్య నవనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బస్టాండ్‌లో మృతదేహంతో నిరసన..

నాగరాజు మృతదేహంతో ఏటూరునాగారం బస్టాండ్‌లో డ్రైవర్లు, యజమానులు టాటా మ్యాజిక్‌లతో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఉచిత బస్సు ప్రయాణంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకపోవడంతో యజమానులు, డ్రైవర్లు దుర్భర జీవితాలు గడుపుతున్నారని టాటా మ్యాజిక్‌ల సంఘం అధ్యక్షుడు శీలం సూర్యనారాయణ అన్నారు. ప్రభుత్వం స్పందించి మృతుడి న్యాయం చేయాలని కోరారు. అలాగే, ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, చాంద్, మున్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వృద్ధుడు..



యాదగిరి(ఫైల్)

రఘునాథపల్లి: జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు రైలు కింద ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన రఘునాథపల్లి రైల్వేస్టేషన్ వద్ద జరిగింది. జనగామ రైల్వే పోలీసుల కథనం ప్రకారం..మండలంలోని కుసుంబాయితండా గ్రామ శివారు రామన్నగూడేనికి చెందిన మరాతి యాదగిరి (60) ఒంటరి జీవనం గడుపుతున్నాడు. జీవితంపై విరక్తి చెందిన యాదగిరి.. మంగళవారం తెల్లవారుజామున రఘునాథపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ రాఘవేంద్ర ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఏడేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

- కామాంధుడిపై పోక్సో కేసు నమోదు

కాటారం: ఓ కామాంధుడు మానవజాతికే కలంకం తెచ్చాడు. ఏడేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహాముత్తారం మండల పరిధి ఓ గ్రామానికి చెందిన ఏడేళ్ల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన నరేశ్ అనే యువకుడు మూడు రోజుల క్రితం లైంగిక దాడికి యత్నించాడు. చిన్నారి తల్లిదండ్రులు ఇంటి దగ్గర లేకపోవడంతో ఈ అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నరేశ్‌పై పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై మహేందర్‌కుమార్ తెలిపారు.

కోనాపురంలో మరొకరిపై..

కొత్తగూడ : కొత్తగూడలోని కోనాపురం గ్రామానికి చెందిన సతీశ్ అదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు గూడూరు సీఐ బాబూరావు తెలిపారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు సతీశ్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

భూపాలపల్లి రూరల్ : విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం భూపాలపల్లి మండలం కొత్తపల్లి(ఎస్ఎం)లో చోటు చేసుకొంది. మృతుడి బంధువుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మోతే సాంబయ్య(55) వ్యవసాయంతోపాటు ఎలక్ట్రీషియన్ పనులు చేస్తుంటాడు. మోరంచవాగు పరీవాహక ప్రాంతంలో ఓ రైతుకు చెందిన మోటారు మరమ్మతు చేస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. దీనిపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

జాతరలో సౌకర్యాలు కల్పించాలి

- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- మినీ మేడారంపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు : మేడారం సమ్మక్క-సారలమ్మ సన్నిధిలో భక్తుల అవసరాలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క సూచించారు. ఈ మేరకు మంగళవారం జిల్లాకేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో వచ్చే నెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరగనున్న మేడారం మినీ జాతర్లపై కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ డాక్టర్ శబరీశ్, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్ర, డీఎఫ్ఓ రాహుల్‌కిషన్ జాదవ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. నాణ్యతతో పనులు చేపట్టి శాశ్వతంగా నిలిచిపోయేలా చూడాలన్నారు. మహా జాతరలో సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే భక్తుల రాక పెరిగిందని, ఫిబ్రవరి మొదటివారం నుంచి మరింత తాకిడి ఎక్కువవుతుందన్నారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు క్యూలైన్లు, తాగునీటి సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడ లోపం లేకుండా ప్రతీ ప్రాంతం శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని డీపీఓ దేవరాజ్‌ను ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, మరుగుదొడ్లను ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. జంపన్నవాగు వద్ద నల్లాలు ఏర్పాటు చేసి, దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక షెడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. సమావేశంలో దేవాదాయశాఖ ఈఓ రాజేందర్, డీఎస్పీ రవీందర్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐలోని జాతరను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు, పక్కన మేయర్ సుధారాణి, కలెక్టర్ ప్రావీణ్య, కుడా చైర్మన్,తదితరులు

- ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు కావాలి
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కోరిన వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు : భక్తులకు వసతుల కల్పనలో ఎక్కడా కాంప్రమైజ్ కావొద్దు.. గతంలో కంటే వైభవంగా జాతరను విజయవంతం చేయాలి.. ప్రభుత్వానికి చెడ్డ పేరు రావొద్దని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆలయ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే అధ్యక్షతన మల్లికార్జున స్వామివారి ఆలయ ప్రాంగణంలోని అన్నదాన సత్రంలో జాతరపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులు మేయర్ గుండు సుధారాణి, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో పాటు కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ముందుగా ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు చేపట్టాల్సిన పనులను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే ఒక్కో శాఖను రివ్యూ చేశారు. మహిళా భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్న అంశానికి కలెక్టర్ ప్రావీణ్య స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లను తక్షణమే ప్రారంభించాలని అందుకు తగిన నిధులు మంజూరు చేస్తామన్నారు. మేయర్ సుధారాణి, 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి మాట్లాడారు. అనంతరం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వీడియో కాల్ ద్వారా అందుబాటులోకి వచ్చారు. ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే నాగరాజు విజ్ఞప్తి చేశారు. కాగా, చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్దేశం చేస్తూ జాతరను విజయవంతం చేయాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. అయితే నిధుల గురించి మాత్రం స్పందించలేదు. అనంతరం పున్నేలు క్రాస్ వద్ద నిర్మించిన డబుల్ ఆర్చి గేట్‌ను ప్రారంభించారు. అలాగే లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ అప్పయ్య, డీసీపీ పులిగిల్ల రవీందర్, ఆర్‌డీఓ రమేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, జాతర అభివృద్ధికి నిధుల మంజూరుపై విలేకరుల అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ ప్రభుత్వం ఈసారి ఎలాంటి నిధుల కేటాయించలేదన్నారు.

ఇంటర్ వర్సిటీ వాలీబాల్ కేయూ మహిళా జట్టు



కేయూ వాలీబాల్ ఉమెన్ జట్టుతో వెంకయ్య

కేయూ క్యాంపస్: చైన్నైలోని జెప్పాలార్ యూనివర్సిటీలో ఈనెల 7న ప్రారంభమై 11వతేదీ వరకు కొనసాగనున్న ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ వాలీబాల్ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ మహిళా జట్టును ఎంపిక చేశామని స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ఆచార్య వై. వెంకయ్య మంగళవారం తెలిపారు. ఎం. స్రవంతి, కె.అనూష(యూసీపీఈ కేయూ వరంగల్), ఎస్. అనుకావ్యాంజలి, డి. వైష్ణవి (టీఎస్‌డబ్ల్యూ ఆర్‌డీసీ, ఉమెన్) వరంగల్ వెస్ట్), షేక్‌ఆశాబేగం (కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీ), ఎ. నందిని, ఎం. శ్యామల(టీజీడబ్ల్యూఆర్‌డీసీ కొత్తగూడెం), టి.సీతామహాలక్ష్మి (టీజీడబ్ల్యూఆర్‌డీసీ, దమ్మపేట), టి. చందన (టీజీడబ్ల్యూఆర్‌డీసీ ఖమ్మం), ఎం.పావని (వీసీపీఈ బొల్లికుంట, వరంగల్), జి. ఐశ్వర్య(యూఎఎస్‌సీ,హనుమకొండ), బి. ఆశ్మిత (వాగ్దేవి డిగ్రీ కాలేజీ ,హనుమకొండ), ఎం. సౌజన్యరాణి, టి. పూజిత (కిట్స్,వరంగల్) ఉన్నారు. ఈ జట్టుకు వరంగల్‌కిట్స్ ఫిజికల్‌డైరెక్టర్ కె. వెంకటస్వామి కోచ్‌అండ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారని వెంకయ్య తెలిపారు.

మార్కెట్ సమస్యలు పరిష్కరించండి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చాంబర్ ప్రతినిధులు వినతి



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చాంబర్ ప్రతినిధులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంత్రిని హైదరాబాద్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కలసి వరంగల్ వ్యవసాయ మార్కెట్ రైతులు, హమాలీలు, కార్మికులు, వ్యాపారుల ఇబ్బందులు, సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న సమస్యలు, ఇంటర్నెట్ వైఫై, ఇంటిగ్రేటెడ్ వెయింగ్ మిషన్లు పనిచేయకపోవడం వలన ఎదురవుతున్న ఆటంకాలను వివరించారు. అలాగే, వ్యవసాయ మార్కెట్‌కు 15 కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్న రైతు సరుకుల ప్రాసెసింగ్ పరిశ్రమలకు సరుకు రవాణా చేసేందుకు రోడ్ల నిర్మాణం చేపట్టాలని అభ్యర్థించారు. వ్యవసాయ మార్కెట్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్‌కు కేటాయించిన స్థలానికి నామమాత్రపు లీజు నిర్ణయించి రైతు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ట్రేడ్ ప్రమోషన్ సెంటర్ నిర్మాణానికి అనుమతించాలని కోరారు. జిల్లాలో వ్యాల్యూ యాడెడ్ పరిశ్రమల అభివృద్ధికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించి జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కటకం పెంటయ్య, అల్లే సంపత్, చింతలపల్లి వీరారావు, లింగారెడ్డి, రాజేశ్, కరాణి, గోని సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖోఖో సమరానికి వేళాయె..

- రేపటి నుంచి రాష్ట్రస్థాయి సీనియర్ పోటీలు
- తరలిరానున్న 350మంది క్రీడాకారులు



సాధన చేస్తున్న జిల్లా బాలుర జట్టు క్రీడాకారులు

గీసుకొండ : వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలోని జెడ్పీ మైదానంలో ఈనెల 9వ తేదీ(రేపటి)నుంచి 11వ తేదీ వరకు రాష్ట్రస్థాయి బాలుర, బాలికల సీనియర్ ఖోఖో పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 350 మంది క్రీడాకారులు తరలిరానున్నారు. విజేతలతో పాటు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను త్వరలో జైపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. కాగా, రాష్ట్రంలో తొలిసారి మ్యాట్‌లు ఏర్పాటు చేసి పోటీలు నిర్వహించనున్నారు.

భారీగా దాతల సాయం..

మ్యాట్ కోసం జంగా రాఘవరెడ్డి రూ.10లక్షలు అందించగా, మనుగొండకు చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు, పోటీల నిర్వహణ కమిటీ చైర్మన్ అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.5 లక్షల సాయం అందించారు. ఎస్‌బీఐ రిటైర్డ్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ రూ.50 వేలు అందించారు. ఏనుగుల సాంబరెడ్డి, ప్రవాస భారతీయుడు డాక్టర్ పసునూరి కల్యాణ్ చేరో రూ.50 విరాళంతో పాటు పలువురు దాతలు సాయం చేశారు.

యువతను ప్రోత్సహిస్తున్నాం..



యువత వ్యసనాలకు దూరంగా ఉండాలనే టోర్నీ నిర్వహణకు సాయం అందించా. జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేలా ప్రోత్సహిస్తున్నాం. టోర్నీ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

- అల్లం బాలకిశోర్‌రెడ్డి, టోర్నమెంట్ చైర్మన్

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం..



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు విజయవంతం చేసేందుకు బాలకిశోర్ రెడ్డి సహకారంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. క్రీడాకారులకు వసతి, భోజన, నీటి సదుపాయం కల్పించాం.

- వీరగోని రాజ్‌కుమార్, టోర్నమెంట్ కన్వీనర్